సాక్షి సూర్యాపేట

సోమవారం । 6 । జనవరి । 2025



ఇథనాల్ కంపెనీ పరిశీలన

రావిపహాడ్ గ్రామంలో నిర్మిస్తున్న ఇథనాల్ కంపెనీని ఆదివారం మానవ హక్కుల వేదిక సభ్యులు సందర్శించారు. - 10లో



'మే'లో టెండర్లు

హైవే-65ను ఆరు లేన్లుగా విస్తరణకు మేలో టెండర్లు పూర్తిచేయనున్నట్టు మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. - 10లో



ముగిసిన భజన పోటీలు

యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి పట్టణంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి భజన పోటీలు ఆదివారంతో ముగిశాయి. - 10లో

న్యూస్‌రీల్

వైభవంగా నారసింహుడి గరుడ వాహన సేవ



ఊరేగింపులో పాల్గొన్న అర్చకులు, భక్తులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీ ప్రహ్లాద యోగానంద శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ముందుగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూల విరాట్‌కు పంచామృతాభిషేకం, ప్రత్యేకార్చనలు చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లి రావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

గోదావరి జలాలు పెంపు



71 డీబీఎం కాలువలో పారుతున్న నీళ్లు

అర్వపల్లి: యాసంగి సీజన్‌కు గాను జిల్లాకు విడుదల చేస్తున్న గోదావరి జలాలను పెంచారు. శనివారం వరకు 700 క్యూసెక్కుల చొప్పున వదలగా ఆదివారం 1,200 క్యూసెక్కులకు పెంచారు. కాగా ఈనెల 1న గోదావరి జలాలను జిల్లాకు విడుదల చేశారు. తొలుత కొద్ది నీళ్లు వదలడంతో కాలువల్లో తూములకు నీళ్లు ఎక్కక రైతులు ఆందోళన చెందడంతో క్రమక్రమంగా నీటిని పెంచుతున్నట్లు బయ్యన్నవాగు డీఈఈ ఎం.సత్యనారాయణ తెలిపారు. ప్రస్తుతం వచ్చే నీళ్లలో 69 డీబీఎంకు 420 క్యూసెక్కులు, 70 డీబీఎంకు 80 క్యూసెక్కులు, 71 డీబీఎంకు 700 క్యూసెక్కుల చొప్పున వదులుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా రంగా



ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా నియామకపత్రం అందుకుంటున్న రంగా

మునగాల: బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా మునగాల మండలం రేపాల గ్రామానికి చెందిన పానుగోటి రంగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నివాసంలో ఆయన చేతుల మీదుగా రంగా నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా రంగా మునగాలలో మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలో బీసీలకు అధికారమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేసిన ఆర్.కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పిల్లుట్ల శ్రీనివాస్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ వీరబోయిన లింగయ్య యాదవ్, బీసీ యువజన సంఘం కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు గద్దం లక్ష్మీనారాయణ యాదవ్, నాయకులు రాజేష్, వీరయ్య పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ధనుర్మాసోత్సవాలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం గోదాదేవిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు గోదాదేవికి మంగళ నీరాజనాలు పలికారు. అదే విధంగా అర్చకులు శ్రీరంగనాథుడిని కొలుస్తూ పాశురాలు పఠించారు. పాశురాల విశిష్టతను భక్తులకు వివరించారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 13వ తేదీ రాత్రి 7 గంటలకు గోదాదేవి కల్యాణం నిర్వహించనున్నారు. 14వ తేదీ ఉదయం 11.30 గంటలకు ఒడిబియ్యం సమర్పించే వేడుక ఉంటుందని ఆలయ అర్చకులు తెలిపారు.

విద్యాబోధన ఆగకుండా..

- సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెతో కేజీబీవీల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- ప్రభుత్వ ఉపాధ్యాయులకు అదనపు బాధ్యతలు
- ప్రతి స్కూల్‌కు నలుగురు చొప్పున కేటాయింపు



అర్వపల్లి కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంఈఓ బాలునాయక్ (ఫైల్)

సూర్యాపేటటౌన్ : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సమ్మె చేస్తుండడంతో విద్యాబోధనకు ఆటంకం కలగకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించింది. జిల్లాలో 435 మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారానికి ఈ నెల 6 నుంచి సమ్మె చేస్తున్నారు. వారిలో అత్యధికంగా కేజీబీవీల్లో పనిచేసే సీఆర్టీలు, బోధనేతర సిబ్బంది ఉన్నారు. వీరంతా సమ్మె చేస్తుండడంతో విద్యాలయాల్లో చదివే బాలికలకు పాఠాలు బోధించేవారు కరువయ్యారు. ఈక్రమంలో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు విద్యా శాఖ తాత్కాలికంగా ప్రభుత్వ ఉపాధ్యాయులకు అదనపు విధులు కేటాయించేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

జిల్లాలో కేజీబీవీలు	18
తరగతులు	6 నుంచి 12
విద్యార్థినుల సంఖ్య	3,409
సమ్మె చేస్తున్న ఉద్యోగులు	354

కేజీబీవీల్లో 3,409 మంది విద్యార్థినులు

జిల్లాలో 23 మండలాలకు కలిపి 18 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యాబోధన అందుతోంది. ఈ విద్యాలయాల్లో మొత్తం 3,409 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఇంటర్, పదో తరగతి వార్షిక పరీక్షల షెడ్యూల్ విడుదల చేసింది. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెతో కేజీబీవీల్లో టెన్త్, ఇంటర్ ఫలితాలపై ప్రభావం పడే అవకాశం ఉంది.

విద్యార్థినులు నష్టపోకుండా చర్యలు



ప్రభుత్వ పాఠశాలల్లో అదనంగా ఉన్న ఉపాధ్యాయులను గుర్తించాం. కొన్ని ఉన్నత పాఠశాలల్లో ఒక్కో సబ్జెక్టుకు ఇద్దరు, నలుగురు ఉపాధ్యాయులు ఉన్న వారిని కేజీబీవీలకు డిప్యుటేషన్‌పై పంపిస్తున్నాం. విద్యార్థులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటున్నాం. త్వరలో అన్ని కేజీబీవీల్లో పూర్తి స్థాయిలో బోధన కొనసాగుతుంది. బోధన, భోజనానికి ఇతర సౌకర్యాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం.

– అశోక్, డీఈఓ, సూర్యాపేట

ఒక్కో విద్యాలయంలో నలుగురికి అదనపు బాధ్యతలు

విద్యార్థినుల బోధనకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వ ఉపాధ్యాయులకు అదనపు విధులు కేటాయించేందుకు ఆయా మండలాల ఎంఈఓలు కసరత్తు ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అదనంగా ఉన్న ఉపాధ్యాయులను గుర్తించి వారిని కేజీబీవీల్లో విధులు నిర్వహించేలా ఏర్పాటు చేస్తున్నారు. సీనియర్ మహిళా ఉపాధ్యాయులను కేజీబీవీల్లో తాత్కాలికంగా ప్రత్యేక అధికారులుగా నియమించారు. అలాగే ప్రతి కేజీబీవీకి నలుగురు ఉపాధ్యాయుల చొప్పున నియమించారు. ఇప్పటికే కొందరు ఉపాధ్యాయులు కేజీబీవీలకు వెళ్లి పాఠాలు బోధిస్తున్నారు. త్వరలో అన్ని కేజీబీవీల్లో సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించనున్నారు. అదే విధంగా ఎమ్మార్సీల్లో పనిచేస్తున్న 354 మంది సమ్మెలోకి వెళ్లడంతో కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. వంట ఏజెన్సీల బిల్లుల నమోదు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల పనుల వివరాలు, పాఠ్య, రాత పుస్తకాలు, యూనిఫామ్ కేటాయింపు, విద్యార్థుల ఫేస్ హాజరు, కొత్తగా చేరిన విద్యార్థుల వివరాలు, మార్కుల వివరాల నమోదు ప్రక్రియ నిలిచిపోయింది. వీరి స్థానంలో కూడా ఉపాధ్యాయులను నియమించేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో అదనంగా ఉన్న ఉపాధ్యాయులను ఎమ్మార్సీలకు డిప్యుటేషన్‌పై పంపాలని నిర్ణయించారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



ఉపాధ్యాయురాలికి అవార్డు అందజేస్తున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

సూర్యాపేట టౌన్: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో అహర్నిశలు కృషి చేస్తారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులకు సూర్యాపేటలోని శ్రీలక్ష్మీ గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో ఆదివారం సావిత్రిబాయి పూలే అవార్డ్స్–2025 ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి జగదీష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలను విద్యావంతులను చేయాలని ఆలోచించిన మహాత్మా జ్యోతిరావు పూలే ముందుగా తన సతీమణి సావిత్రిబాయి పూలేను చదివించి ఉపాధ్యాయురాలిని చేయడం గొప్ప విషయమన్నారు. తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా ఆమె జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఆమె ఎన్నో పోరాటాలు చేశారన్నారు. దేశం గర్వించదగ్గ గొప్ప సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భూతం యాకమల్లు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లమల్ల నర్సింహ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు దామెర శ్రీనివాస్, మట్టపల్లి రాధాకృష్ణ, వేణుగోపాల్‌రెడ్డి, సౌజన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నారసింహుడికి మొక్కులు

యాదగిరిగుట్ట: పంచనారసింహ క్షేత్రంగా విరాజిల్లుతున్న యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం సంప్రదాయ పూజలు ఆగమశాస్త్రం ప్రకారం చేపట్టారు. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం సేవ చేపట్టారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూలు, ప్రతిష్టా అలంకారమూర్తులను నిజాభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు. ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖమండపంలో అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఆయా వేడుకల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామి, అమ్మవారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

భారంగా 'మధ్యాహ్నం' గుడ్డు

- ధర పెరగడంతో పాఠశాలల్లో సక్రమంగా అందించని వంట ఏజెన్సీలు
- వారంలో మూడుసార్లు ఇవ్వాల్సి ఉన్నా ఒకటి, రెండింటితోనే సరి
- పోషకాహారానికి దూరమవుతున్న విద్యార్థులు



తిరుమలగిరి (తుంగతుర్తి): కోడి గుడ్ల ధర రోజురోజుకూ పెరిగిపోతోంది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే వంట ఏజెన్సీ నిర్వాహకులు గుడ్లు పెట్టలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా విద్యార్థులు పోషకాహారానికి దూరం అవుతున్నారు. అయితే మధ్యాహ్న భోజనం అమలులో భాగంగా ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో విద్యార్థులకు కోడి గుడ్లు అందించాలి. కానీ కొన్ని పాఠశాలల్లోనే ఒకటి, రెండుసార్లు మాత్రమే విద్యార్థులకు కోడి గుడ్లు అందిస్తున్నారు. మిగతా వాటిల్లో సక్రమంగా అందించడం లేదు. కాగా జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 981 ఉండగా విద్యార్థులు 5,191 మంది ఉన్నారు.

ప్రభుత్వం చెల్లించేది ఐదు రూపాయలే..

ప్రభుత్వం మధ్యాహ్న భోజనంలో కోడి గుడ్డు అందించేందుకు గాను ఒక్కోదానికి రూ.5 చెల్లిస్తోంది. కానీ, ప్రస్తుతం మార్కెట్‌లో ఒక్కో కోడి గుడ్డు ధర ఏడు రూపాయలు పలుకుతోంది. దీంతో నిర్వాహకులకు ఆర్థిక భారంగా మారింది. మధ్యాహ్న భోజనంలో నెలకు 12 సార్లు గుడ్డు ఇవ్వాలి. ప్రస్తుతం రూ.5 మాత్రమే చెల్లిస్తుండటంతో ఒక్కొక్కరిపై అదనంగా నెలకు రూ.24 భారం పడుతుందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ భారం భరించలేక కొన్ని పాఠశాలల్లో వారంలో రెండుసార్లు కోడి గుడ్డు ఇచ్చి మరో రోజు అరటి పండు లాంటివి ఇస్తున్నారు.

నవంబర్ నుంచి ధర పెరగడంతో..

ప్రాథమిక పాఠశాలలతో పాటు ఆదర్శ పాఠశాలలు, ఇతర ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఎక్కువ మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనంతో ఆకలి తీర్చుకుంటున్నారు. వారానికి మూడుసార్లు అందించాలి. కానీ, గత ఆగస్టులో మార్కెట్‌లో ఒక్కో గుడ్డు ధర రూ.4.50 ఉండగా నవంబర్ నుంచి రూ.7కు పెరిగింది. దీంతో నిర్వాహకులపై రూ.2 అదనపు భారం పడుతుందని, మరోవైపు ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి గుడ్ల బిల్లులు సరిగా రావడం లేదని కార్మికులు వాపోతున్నారు.


ఆర్థిక భారం పడుతోంది



విద్యార్థులకు వారానికి మూడుసార్లు గుడ్డు అందజేస్తున్నాం. ప్రభుత్వం ఒక్కో గుడ్డుకు రూ.5 చెల్లిస్తుండగా దుకాణాల్లో మాత్రం వాటి ధర రూ.7కు పెరిగింది. దీంతో ఒక్కో విద్యార్థిపై నెలకు రూ.24 ఖర్చు చేయాల్సి వస్తుండడంతో మాపై ఆర్థిక భారం పడుతోంది.

– మంజుల, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు, తిరుమలగిరి

ధరలకు అనుగుణంగా చెల్లింపులు ఉండాలి



మార్కెట్‌లో ఒక్కో గుడ్డును రూ.7 చొప్పున కొనుగోలు చేసి తెచ్చి విద్యార్థులకు వండి పెడుతున్నాం. వారంలో మూడుసార్లు కోడి గుడ్డు పెట్టాల్సి వస్తోంది. మార్కెట్‌లో ప్రస్తుతం ఉన్న ధరలకు అనుగుణంగా ప్రభుత్వం వంట ఏజెన్సీలకు కోడి గుడ్లకు ఇస్తున్న రేటు పెంచాలి.

– శోభ, మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకురాలు, అనంతారం

చెస్‌తో మేధాశక్తి పెంపొందుతుంది



చిన్నారులకు షీల్డ్‌లు అందజేస్తున్న చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గండూరి కృపాకర్

సూర్యాపేట: చెస్ ఆడడం వల్ల విద్యార్థుల్లో మేధాశక్తి పెంపొందుతుందని చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గండూరి కృపాకర్ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి అండర్–7, 9, 11, 15 బాలబాలికల చెస్ పోటీల్లో విజేతలైన వారికి షీల్డ్‌లు, సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. అంతకుముందు గండూరి కృపాకర్ తన పుట్టిన రోజు సందర్భంగా అసోసియేషన్ సభ్యులు క్రీడాకారుల సమక్షంలో భారీ కేక్ కట్ చేశారు. చెస్ పోటీల్లో పాల్గొన్న వంద మంది విద్యార్థులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా వంద మంది క్రీడాకారులు హాజరుకాగా 24మంది విజేతలుగా నిలిచారన్నారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.సతీష్‌కుమార్, ఉపాధ్యక్షుడు సాయికుమార్, సహాయ కార్యదర్శి లింగారెడ్డి, కోశాధికారి వెంకటమురళి, కార్యవర్గ సభ్యులు జానయ్య, రాజేష్, నరసింహారావు, మచ్చ శాంతకుమార్, భిక్షం, కళ్యాణ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కలిసి భోజనం చేసి.. సమస్యలు తెలుసుకుని



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తూ మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- బీబీనగర్‌లో బీసీ బాలికల గురుకులం, ఎస్సీ బాలికల హాస్టల్‌ను సందర్శించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- కిచెన్, డైనింగ్‌హాల్, కూరగాయలు, కిరాణా సరుకుల తనిఖీ
- హాస్టళ్లలో సమస్యలు, నూతన మెనూ అమలు తీరుపై ఆరా



వంటలను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

బీబీనగర్ : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదివారం బీబీనగర్ మండల కేంద్రంలోని బీసీ బాలికల గురుకులం, ఎస్సీ బాలికల హాస్టల్‌ను సందర్శించారు. బీసీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. నూతన మెనూ అమలు, వసతిగృహంలో కల్పిస్తున్న సౌకర్యాలు, సమస్యలపై వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అదే ఆవరణలో నిర్వహిస్తున్న ఎస్సీ బాలికల హాస్టల్‌ను సందర్శించారు. కిచెన్, డైనింగ్‌హాల్, కూరగాయలు, తదితర వంట సరుకులను పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ప్రిన్సిపాల్, వంట సిబ్బందితో మాట్లాడారు. నూతన మెనూ ప్రకారం భోజనం అందజేయాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోటీపడి డిప్యూటీ సీఎంతో సెల్ఫీలు దిగారు. ఉప ముఖ్యమంత్రికి భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు గంగాధర్, వీరారెడ్డి, విద్యార్థినులు స్వాగతం పలికారు.

వేతనాలు పెంచాలంటూ వేడుకోలు

వేతనాలు పెంచాలని ఎస్సీ బాలికల వసతిగృహంలోని వంట సిబ్బంది డిప్యూటీ సీఎంకు విన్నవించారు. ఇదే హాస్టల్ ఆవరణలో కొనసాగుతున్న బీసీ గురుకుల హాస్టల్‌లో వంట సిబ్బందికి నెలకు రూ.15వేలు చెల్లిస్తున్నారని, తమకు రూ.6వేలు మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు ఆయన స్పందిస్తూ వేతన విషయమై చర్చిస్తానని వారికి హామీ ఇచ్చారు.

బాలికల గురుకుల విద్యార్థినులతో సంభాషణ సాగిందిలా..

భట్టి: డైట్ చార్జీలు పెంచాం కదా.. భోజనం ఎలా ఉంది ఇప్పుడు

విద్యార్థినులు: చాలా బాగుంది సార్.. మంచి భోజనం తినగలుగుతున్నాం

భట్టి: కూరలు రుచిగా ఉంటున్నాయా, సమయానికి పెడుతున్నారా

విద్యార్థినులు: ఉంటున్నాయి సర్, సమయానికి భోజనం అందజేస్తున్నారు

భట్టి: మెనూ ప్రకారం స్నాక్స్ ఇస్తున్నారా

విద్యార్థినులు: ప్రస్తుతానికి అన్నీ ఇస్తున్నారు. స్నాక్స్ బాగుంటున్నాయి సార్

భట్టి: మటన్, చికెన్ ఎలా ఉంటుంది.. అడిగినంత పెడుతున్నారా..

విద్యార్థినులు: బిర్యాని రైస్‌తో మటన్, చికెన్ పెడుతున్నారు. రుచిగా ఉంటుంది సార్

భట్టి: ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారా

విద్యార్థినులు: చేస్తున్నారు సార్

భట్టి: ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా

విద్యార్థినులు: తలిదండ్రులు తీసుకువచ్చే స్నాక్స్‌ను అనుమతించడం లేదు సార్. వాటిని తిరిగి అనాథశ్రమాలకు పంపుతున్నారు.

భోజనాలు ఓకే.. చదువుల్లో గ్రేడ్ పెంచండి

ఎస్సీ బాలిక హాస్టల్‌ను డిప్యూటీ సీఎం సందర్శించిన సమయంలో ఆసక్తికర సన్నివేశం చోటు చేసుకుంది. నిత్యావసరాలను పరిశీలిస్తున్న క్రమంలో భట్టితో టీచర్లు నూతన డైట్ గురించి ప్రస్తావించారు. కొత్త డైట్ అమల్లోకి వచ్చాక పిల్లలు, తాము అదృష్టవంతులయ్యామని, వారంలో మూడుసార్లు చికెన్, మటన్ అందజేస్తున్నారని, స్నాక్స్‌లో కొత్త రకాలు ఇవ్వడం బాగుందన్నారు. అందుకు భట్టి నవ్వుతూ.. భోజనం ఓకే, చదువులో విద్యార్థినుల గ్రేడ్ పెంచాలని టీచర్లకు సూచించడంతో వారంతా చిరునవ్వులు చిందించారు.

భారీగా తరలివచ్చిన కార్యకర్తలు

డిప్యూటీ సీఎం వస్తున్నట్లు తెలియడంతో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు భారీగా చేరుకున్నారు. అందరూ ఒకేసారి క్యాంపస్‌లోకి రావడంతో కొంత గందరగోళం నెలకొంది. బాలికల హాస్టళ్లు కాబట్టి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్ప మిగితా వారందరినీ బయటకు పంపాలంటూ భట్టి పోలీసులకు ఆదేశించి కారు ఎక్కి వెనుదిరి గారు. పార్టీ శ్రేణులను పోలీసులు దూరంగా పంపిన అనంతరం భట్టి తిరిగి క్యాంపస్‌లోకి వచ్చారు.

సూర్యక్షేత్రంలో వైభవంగా సౌరహోమం

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయ సమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. ఆ తర్వాత యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని నిర్వహించారు. క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాదసత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకులు జనార్దన్ స్వామి, గణపురం నరేష్, కర్నాటి నాగేశ్వర్ రావు, ఇంద్రారెడ్డి, అర్చకులు భీంపాండే, శ్రీరాంపాండే, అంకిత్‌పాండే పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

- మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మిర్యాలగూడలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 26 నుంచి రైతు భరోసా కింద రూ.12వేలు, భూమిలేని వ్యవసాయ కుటుంబాలకు రూ.12వేలు, రేషన్‌కార్డులను అందిస్తామని చెప్పిందని వాటిని అర్హులైన వారందరికీ అందించాలన్నారు. రైతు భరోసా కింద రూ.15వేలు అందిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు రూ.12వేలు ఇస్తామనడం సరికాదన్నారు. గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్‌లు పంపిణీ చేయకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయని.. వాటికి మరమ్మతులు చేపట్టి అర్హులైన పేదలకు అందించాలన్నారు. లేకుంటే ప్రజలను సమీకరించి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, శశిధర్‌రెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, వినోద్‌నాయక్, రెమిడాల పరశురాములు, రొండి శ్రీనివాస్, చౌగాని సీతారాములు, బావండ్ల పాండు, సైదులు, మల్లయ్య, సైదులు, శ్రీనివాస్‌రెడ్డి, చౌగాని వెంకన్న, కోటిరెడ్డి, రామకృష్ణ, సైదులు, లింగయ్య, రాంరెడ్డి, సైదానాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పొలంలోకి దూసుకెళ్లి ట్రాక్టర్ బోల్తా



పొలాల్లోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

హుజూర్‌నగర్‌రూరల్: మఠంపల్లి నుంచి వడ్ల బస్తాల లోడుతో వస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ఘటన హుజూర్‌నగర్ మండలం మగ్దూంనగర్ సమీపంలో ఆదివారం జరిగింది. స్థానికులు గమనించి డ్రైవర్‌ను పొలంలో నుంచి బయటకు తీసుకొచ్చారు. వడ్ల బస్తాలు వరి పొలంలో పడి తడిసిపోయాయి. ట్రాక్టర్ డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

నాలుగు కిలోల గంజాయి పట్టివేత

- ఇద్దరు యువకుల అరెస్ట్

రామన్నపేట: ఒరిస్సా రాష్ట్రం నుంచి గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు యువకులను రామన్నపేట మండల కేంద్రంలో ఆదివారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు నాలుగు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు యువకులు బైక్‌పై గంజాయి తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో స్థానిక ఎస్‌ఐ పి. మల్లయ్య తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తాలో బైక్‌పై అనుమానాస్పదంగా వెళ్తున్న ఇద్దరు యువకులను ఆపి తనిఖీ చేయగా నాలుగు కిలోల గంజాయి దొరికింది. పట్టుబడిన యువకులను పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు.

గోవులను తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

చౌటుప్పల్: ఆటోలో గోవులను కుక్కి తరలిస్తున్న వ్యక్తిపై ఆదివారం చౌటుప్పల్ పోలీసులు కేసు నమోదు చేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంకు చెందిన ఓ రైతు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనకాపల్లిలో నాలుగు గోవులను కొనుగోలు చేశాడు. నాలుగు గోవులను ఒకే ఆటోలో కుక్కి స్వగ్రామానికి తరలిస్తుండగా.. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని తంగడపల్లి చౌరస్తా వద్ద పోలీసులు ఆటోను ఆపారు. గోవులను హింసకు గురిచేస్తున్న సదరు రైతుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో మంత్రి పీఏ ఫిర్యాదు

హైదరాబాద్: సోషల్ మీడియాలో తనపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పీఏ సైదులు ఆదివారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం వెలుగులపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సింగారం తండాకు చెందిన భూ వ్యవహారంలో తన ప్రమేయం లేనప్పటికీ కొంతమంది వాట్సాప్ ద్వారా తప్పుడు కథనాలను వ్యాప్తి చేస్తున్నారని తెలిపారు. తన పరువుకు భంగం కలిగించేలా దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆశ్రయించినట్లు సైదులు పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారని, విచారం చేసి బాధ్యులపై చట్టపరంగా చర్యలు ఉంటాయని వివరించారు.

అక్రమంగా ఇసుక రవాణా

- ఆన్‌లైన్‌లో 20 ట్రాక్టర్లకు అనుమతి తీసుకుని 200 ట్రాక్టర్ల ఇసుక రవాణా
- లక్ష్మీదేవిగూడెం, కొరటికల్ గ్రామాల మధ్య వాగుపై వంతెన నిర్మాణం చేపట్టిన ప్రదేశంలో డంప్
- కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



భారీగా డంప్ చేసిన ఇసుక

మునుగోడు: ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఏదో ఒకవిధంగా అక్రమ రవాణా కొనసాగుతూనే ఉంది. ఇందుకు నిదర్శనమే మునుగోడు మండలం కొరటికల్ గ్రామ సమీపంలోని నూతన వంతెన నిర్మాణం వద్ద దాదాపు 200 ట్రాక్టర్ల ఇసుక డంప్ ఉండటమే. మునుగోడు నుంచి దుబ్బకాల్వ గ్రామం మీదుగా వేస్తున్న బీటీ రోడ్డు నిర్మాణంలో భాగంగా లక్ష్మీదేవిగూడెం, కొరటికల్ గ్రామాల మధ్య వాగుపై రూ.4 కోట్లతో వంతెన నిర్మాణం చేపడుతున్నారు. ఈ వంతెన నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ సాండ్ టాక్సీ ద్వారా నెల రోజుల క్రితం 20 ట్రాక్టర్ల ఇసుకకు ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించాడు. అయితే 20 ట్రాక్టర్లకు అనుమతి తీసుకుని దాదాపు 200 ట్రాక్టర్ల ఇసుకని అక్రమంగా వంతెన నిర్మాణం చేపట్టిన ప్రదేశంలో డంప్ చేశాడు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు సంబంధిత అధికారులపై మండిపడుతున్నారు. సామాన్యులు ఒక ట్రిప్పు ఇసుక వాగులో నుంచి తరలిస్తే కేసులు పెడుతారు కానీ వంతెన నిర్మాణ కాంట్రాక్టర్ పెద్ద మొత్తంలో అక్రమంగా ఇసుక డంప్ చేస్తుంటే ఎందుకు అడ్డుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉదయం వేళ అక్రమ రవాణా..

సాండ్ టాక్సీ ద్వారా ఇసుక బుక్ చేసుకుంటే ఉదయం 10 గంటల నుంచి కొరటికల్ వాగు నుంచి ట్రాక్టర్ యజమానులు ఇసుక లోడు చేసుకొని బుక్ చేసుకున్న వారి ఇంటి వద్దకు తీసుకెళ్లి ఆన్‌లోడ్ చేస్తారు. అయితే కొరటికల్, మునుగోడు గ్రామాలకు చెందిన కొన్ని ట్రాక్టర్లు ఉదయం 8 గంటలకే వాగులో ఇసుక లోడ్ చేసుకొని వంతెన నిర్మాణం చేపట్టిన ప్రదేశంలో డంప్ చేస్తున్నారు. 11 గంటల తర్వాత ఆన్‌లైన్ ద్వారా వచ్చిన మెసేజ్ ప్రకారం ఇసుక నింపుకుని అధికారికంగా రవాణా చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై కొరటికల్ గ్రామ ఇసుక రీచ్ ఎస్ఆర్ఓ వంశీని వివరణ కోరగా.. వంతెన నిర్మిస్తున్న కాంట్రాక్టర్ ముగ్గురు, నలుగురి పేరిట 20 రోజుల క్రితం 20 ట్రిప్పుల ఇసుక ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నారని, ఆ తర్వాత ఎటువంటి ఇసుక బుక్ చేసుకోలేదని తెలిపారు.

వడ్డీ వ్యాపారి ఇంట్లో పోలీసుల సోదాలు..?

- పలు రిజిస్టర్లు, కొంత నగదు సీజ్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం
- పదిహేను రోజులు కావొస్తున్నా కేసు నమోదులో జాప్యం
- పోలీసుల తీరుపై పలు అనుమానాలు

ఆలేరురూరల్: ఆలేరు పట్టణానికి చెందిన ఓ వడ్డీ వ్యాపారి ఇంట్లో పోలీసులు సోదాలు చేసి పలు రిజిస్టర్లు, కొంత నగదు సీజ్ చేసినట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం మేరకు... సదరు వడ్డీ వ్యాపారి ప్రభుత్వం నుంచి ఎటువంటి లైసెన్స్, అనుమతులు తీసుకోకుండా కొన్ని సంవత్సరాలుగా ఫైనాన్స్, వడ్డీ, చిట్టీల వ్యాపారం చేస్తుండగా.. సదరు వడ్డీ వ్యాపారిపై ఆలేరు పట్టణానికి చెందిన ఓ వ్యక్తి పదిహేను రోజుల క్రితం ఆలేరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ మేరకు వడ్డీ వ్యాపారి ఇంటిపై పోలీసులు సోదాలు చేసి వడ్డీ, చిట్టీలకు సంబంధించిన రిజస్టర్లతో పాటు కొంత నగదు కూడా సీజ్ చేసినట్లు సమాచారం.

కేసు నమోదులో జాప్యం..

వడ్డీ వ్యాపారి ఇంట్లో సోదాలు చేసిన విషయానని పోలీసులు గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. సోదాలు చేసి పదిహేను రోజులు అవుతున్నా అతడిపై ఇప్పటి వరకు ఎలాంటి కేసు నమోదు చేయకపోవడం పలు అనుమానాలు తావిస్తోంది. సదరు వడ్డీ వ్యాపారిని ఈ కేసు నుంచి తప్పించే ప్రయత్నం చేస్తున్నారా లేక పోలీసులు నిజ నిర్ధారణ కోసమని గోప్యంగా ఉంచే ప్రయత్నం చేస్తున్నారా అని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ కేసుకు సంబంధించి పెద్ద మొత్తంలో డబ్బు చేతులు మారినట్లు పలువురు గుసగుసలాడుకుంటున్నారు.

సోదాలు చేసిన విషయం వాస్తవమే..



రజనీకర్, ఎస్ఐ

ఆలేరు పట్టణానికి చెందిన వడ్డీ వ్యాపారిపై ఓ వ్యక్తి ఫిర్యాదు చేయడంతో సదరు వ్యాపారి ఇంట్లో సోదాలు చేసిన విషయం వాస్తవమే అని ఆలేరు ఎస్ఐ రజనీకర్ తెలిపారు. పూర్తిస్థాయి విచారణ చేపట్టామని, ఎవరైనా బాధితులు వచ్చి ఫిర్యాదు చేస్తే తప్పక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

తిప్పర్తి: మహిళ ఆగి ఉన్న బస్సు ఎక్కుతుండగా.. వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో సదరు మహిళ బస్సు చక్రాల కిందపడి మృతిచెందింది. ఈ ఘటన తిప్పర్తి మండలం దుప్పలపల్లి గ్రామం వద్ద ఆదివారం జరిగింది. ఎస్ఐ సాయి ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం పల్లెపాలెం గ్రామానికి చెందిన సింగోతు నిర్మల (37) కుటుంబంతో కలిసి గత మూడు నెలలుగా హైదరాబాద్‌కు వలస వచ్చి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. రెండు రోజుల క్రితం రేషన్ కార్డు తంబ్ ఇంప్రెషన్ ఇవ్వడానికి స్వగ్రామం పల్లెపాలెం గ్రామానికి వెళ్లింది. శనివారం రాత్రి తిరిగి హైదరాబాద్‌కు రావడానికి ఒంగోలు బస్టాండ్‌లో వినాయక ట్రావెల్స్ బస్సు ఎక్కింది. ఆదివారం తెల్లవారుజామున ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు తిప్పర్తి మండలం దుప్పలపల్లి గ్రామం వద్ద మూత్రవిసర్జన కోసం డ్రైవర్ బస్సును ఆపాడు. ప్రయాణికులు మూత్రవిసర్జన చేసి తిరిగి బస్సు ఎక్కారు. నిర్మల ఆఖర్లో బస్సు ఎక్కుతుండగా.. మిర్యాలగూడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ ఆగి ఉన్న బస్సును వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బస్సు ముందుకు కదలడంతో నిర్మల జారి బస్సు వెనుక టైరు కిందపడి అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి భర్త వెంకటరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. రోడ్డుపై బస్సు ఆపిన బస్సు డ్రైవర్ దేవదత్తుపై, అజాగ్రత్తగా లారీ నడిపిన లారీ డ్రైవర్ ముబారక్‌ఖాన్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మురుగు కాల్వ పైకప్పు ధ్వంసం



రామన్నగూడెంలో హైవే వెంట మురుగు కాల్వ పైకప్పు ధ్వంసం చేసిన గుర్తుతెలియని వ్యక్తులు

అర్వపల్లి: సూర్యాపేట–జనగామ 365బీ జాతీయ రహదారి వెంట జాజిరెడ్డిగూడెం మండలం రామన్నగూడెంలో ఏర్పాటు చేసిన మురుగు కాల్వ పైకప్పును గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులోని ఇనుప చువ్వలను ఎత్తుకెళ్తున్నారు. హైవే విస్తరణలో భాగంగా వర్షపు నీరు, మురుగు నీరు వెళ్లడానికి పెద్ద మురుగు కాల్వను నిర్మించి దానిపై పైకప్పు నిర్మించారు. కొద్దిరోజులుగా రాత్రివేళ ఈ కాల్వపై ఉన్న పైకప్పును గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి అందులోని ఇనుప చువ్వలను ఎత్తుకెళ్లి అమ్ముకుంటున్నారు. అదేవిధంగా హైవే వెంట ఏర్పాటు చేసిన రెయిలింగ్ ఎక్కడికక్కడ ధ్వంసమైంది. అర్వపల్లి, రామన్నగూడెం గ్రామాల్లో కొంత కాలంగా సెంట్రల్ లైట్లు కూడా వెలగడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి హైవేపై నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

చాంపియన్‌గా మిస్టర్ డిపెండబుల్స్ జట్టు

మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో గల క్లియో స్పోర్ట్స్ గ్రౌండ్‌లో పది రోజులుగా నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో స్థానిక జట్టు మిస్టర్ డిపెండబుల్స్ జట్టు చాంపియన్‌గా నిలిచిందని క్రికెట్ కోచ్ కావలి వెంకన్న ఆదివారం తెలిపారు. వైద్యులు రోహిత్, సమీలు, సీనియర్ క్రీడాకారులు జానీపాషా, భరత్‌రెడ్డి, సాయికృష్ణ, ఆర్ఈ. వెంకన్న, పగిళ్ల వెంకన్న ముఖ్యఅతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా 20 జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా మహేష్, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా హరి, బెస్ట్ బౌలర్‌గా మణికిరణ్ నిలిచారని టోర్నమెంట్ నిర్వాహకులు మాజిద్, ముజాహిద్ తెలిపారు.



కప్ అందుకుంటున్న మిస్టర్ డిపెండబుల్స్ జట్టు

కొండచిలువ హతం



త్రిపురారం: నిడమనూరు మండలంలోని రాజన్నగూడెం గ్రామంలో ఆదివారం గొర్రెల కాపరులకు కొండచిలువ కనిపించడంతో హతమార్చారు. గ్రామ పరిధిలోని కొండల్లోకి గొర్రెలు, మేకలను కాపారులు మేత కోసం తోలుకెళ్తుంటారు. దీంతో ఇటీవల ఓ మేక పిల్లను కొండచిలువ తిన్నట్లు కాపరులు అనుమానిస్తున్నారు. ఆదివారం మేకలు మేస్తున్న సమయంలో కొండచిలువ రావడంతో కాపరులు గుర్తించి హతమార్చారు.

బీజేపీ సంస్థాగతంలో వేగం

- మండల, మున్సిపల్ అధ్యక్షుల నియామకానికి కసరత్తు
- దరఖాస్తుల స్క్రీనింగ్
- ప్రాధాన్యతా క్రమంలో ముగ్గురి పేర్ల చొప్పున రాష్ట్ర నాయకత్వానికి..

సాక్షి,యాదాద్రి : సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించిన బీజేపీ.. మండల, మున్సిపల్ అధ్యక్షుల నియామకానికి కసరత్తు వేగిరం చేసింది. ఆదివారం హైదరాబాద్ మేడిపల్లిలోని ఓ హోటల్‌లో జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ అధ్యక్షతన స్క్రీనింగ్ కమిటీ సమావేశమై దరఖాస్తులను వడపోసింది. దరఖాస్తులు ఎన్ని వచ్చినా ప్రాధాన్యత క్రమంలో ముగ్గురి పేర్లను ఎంపిక చేసి రాష్ట్ర నాయకత్వానికి పంపినట్లు తెలుస్తోంది. ఈనెల 10లోగా మండల, మున్సిపల్ అధ్యక్ష ఎన్నికలు పూర్తి చేసి జిల్లా కమిటీ ఎన్నికపై ఫోకస్ పెట్టనుంది.

4 మున్సిపాలిటీలు, 12 మండలాలు

ఆలేరు, భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో నాలుగు మున్సిపాలిటీలు, 12 మండలాలు ఉన్నాయి. ఇందులో తుర్కపల్లి, గుండాల, బీబీనగర్, భూదాన్‌పోచంపల్లి మండలాల నుంచి దరఖాస్తులు స్వీకరించాల్సి ఉంది. ఈ ప్రక్రియ ఒకటి రెండు రోజుల్లో పూర్తికానున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. భువనగిరి, యాదగిరిగుట్ట, ఆలేరు మున్సిపాలిటీల నుంచి అధ్యక్ష పదవి ఆశిస్తున్న నేతలు పదుల సంఖ్యలో ఉన్నారు. అయితే ఇక్కడ పార్టీ అవసరాలు, పార్టీ పట్ల విధేయతను పరిగణలోకి తీసుకుని మరికొందరి పేర్లను కూడా చేర్చేందుకు కమిటీలో చర్చించినట్లు తెలిసింది.

నల్లగొండ, సూర్యాపేట నుంచి ఎంపిక

చౌటుప్పల్ మున్సిపాలిటీ, చౌటుప్పల్ మండలం, సంస్థాన్‌నారాయణపురం, రామన్నపేట మండల అధ్యక్షులను నల్లగొండ జిల్లా నుంచి, మోత్కూరు మున్సిపాలిటీ, మోత్కూరు మండలం, అడ్డగూడూరు మండలాల అధ్యక్షులను సూర్యాపేట జిల్లా నుంచి ఎంపిక చేయనున్నారు.

పరిగణనలోకి ముగ్గురే..

మండలాలు, మున్సిపాలిటీ అధ్యక్ష పదవికి వచ్చిన దరఖాస్తులను స్క్రీనింగ్ కమిటీ షార్ట్ లిస్టు చేసినట్లు తెలుస్తోంది. ప్రాధాన్యత క్రమంలో ముగ్గురి పేర్లను ఎంపిక చేసి రాష్ట్ర నాయకత్వానికి పంపించారు. సామాజిక సమీకరణలు పరిగణలోకి తీసుకుంటామని, మహిళలకు ప్రాధాన్యం ఉంటుందని జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ 'సాక్షి'తో చెప్పారు. మూడు నాలుగు రోజుల్లో అధ్యక్షుల పేర్లను రాష్ట్ర నాయకత్వం ప్రకటించే అవకాశం ఉంది. స్క్రీనింగ్ కమిటీ సమావేశానికి సంస్థాగత ఎన్నికల జోనల్ ఇంచార్జ్ పేరాల శేఖర్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి జయశ్రీ, అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, గూడూరు నారాయణరెడ్డి, పడాల శ్రీనివాస్‌తో పాటు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వండి

భువనగిరి : మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు పోలీసు అధికారులకు సూచించారు. ఆదివారం భువనగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన డీసీపీ రాజేశ్‌చంద్రతో కలిసి సందర్శించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కమిషనరేట్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో అధికారులు, సిబ్బంది పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై సమీక్షిస్తున్నట్లు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతర నిఘా ఉంచాలని పోలీసు అధికారులకు సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు, కేసుల పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు స్టేషన్‌లో రికార్డులను పరిశీలించడంతో పాటు రిసెప్షన్, పెట్రోలింగ్ సిబ్బంది, పలు విభాగాల పనితీరుపై ఆరా తీశారు. అదే విధంగా సీసీ టీవీల నిర్వహణపై సమీక్షించారు. ఆయన వెంట భువనగిరి ఏసీపీ రాహుల్ రెడ్డి, ఎస్‌హెచ్‌ఓ సంతోష్‌కుమార్ ఉన్నారు.

రెండు కార్లు ఢీ.. ఒకరు మృతి

భువనగిరి: రెండు కార్లు ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన భువనగిరి మండలం పగిడిపల్లి గ్రామం వద్ద ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌లోని సాయినగర్‌కు చెందిన భువనగిరి శ్రీనివాస్‌రావు, అతడి భార్య ప్రభావతితో పాటు వారి బంధువు లోకాన్ వెంకటరమణ(50), అతడి భార్య పుష్పలత, కుమార్తె అశ్రిత, అత్తమ్మ కందుల అంజమ్మ కలిసి ఆదివారం ఉదయం యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహాస్వామి దర్శనానికి కారులో వచ్చారు. దర్శనం అనంతరం మధ్యాహ్నం తిరిగి హైదరాబాద్‌కు వెళ్తుండగా.. భువనగిరి మండలం పడిగిపల్లి గ్రామం వద్ద సర్వీస్ రోడ్డు నుంచి వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారి పైకి వెళ్తుండగా వెనుక నుంచి మరో కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకటరమణ అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌ఓ సంతోష్‌కుమార్ తెలిపారు.

విద్యార్థుల మేధస్సుతోనే దేశాభివృద్ధి సాధ్యం

- మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

బీబీనగర్: విద్యార్థుల మేధస్సు వికసిస్తేనే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని బీజేపీ నేత, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బీబీనగర్ మండల కేంద్రంలోని కిడ్స్ కింగ్‌డమ్ గ్రామర్ హైస్కూల్ ఆధ్వర్యంలో పీఆర్‌జీ గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం విద్య కేవలం ఉద్యోగం కోసమే అన్నట్టుగా మారిపోయిందని అన్నారు. మాతృభాష చాలా అవసరమని దాన్ని సంపూర్ణంగా అమలు చేయాలని అన్నారు. దేశంలో ఎక్కువ మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లోనే చదువుతున్నారని, విద్య ఉన్నత వర్గాలకు ఒకలా, పేదలకు ఒకలా మారిందని పేర్కొన్నారు. అమెరికాలో మన దేశ విద్యార్థులు గల్లా ఎగురవేసే స్థాయికి ఎదిగామన్నారు.

సమాజానికి ఉపయోగపడాలి

విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే విధంగా ఎదగాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. రాష్ట్ర, దేశ అభివృద్ధికి విద్యార్థులు మార్గదర్శులుగా నిలవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో నేలకొండపల్లి ప్రకృతి వైద్య నిపుణుడు రామచంద్రరావు, పాఠశాల కరస్పాండెంట్ మధుసూదన్‌రెడ్డి, అచ్చయ్యగౌడ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పింగళిరెడ్డి, శ్యామ్‌గౌడ్ సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ వాసికి డాక్టరేట్



వెంకటేశ్వర్లు

నల్లగొండ: పట్టణానికి చెందిన పున్న వెంకటేశ్వర్లు గుజరాత్‌లోని చరీటీర్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. చరీటీర్ యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెసర్ డాక్టర్ మెహుల్ పటేల్ పర్యవేక్షణలో ఎంపిక చేసిన క్యాన్సర్ నిరోధక ఔషధాల మొక్క విశ్లేషనాత్మక పద్ధతి అభివృద్ధి ధృవీకరణ అనే అంశంపై పరిశోధన చేసినందుకు ఆదివారం యూనివర్సిటీ అధికారులు వెంకటేశ్వర్లుకు డాక్టరేట్ అందజేశారు.

పొద్దుతో కూలీల పోటీ

యాసంగి సీజన్ వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. కూలీలు వరి నాట్లు వేసేందుకు పొద్దుతో పోటీ పడుతున్నారు. సూర్యోదయానికి ముందే పొలాలకు చేరుకుంటున్న మహిళా కూలీలు సూర్యాస్తమయం సమయాన ఇళ్లకు చేరుకుంటున్నారు. మధ్యాహ్నం పొలం గట్లమీద అందరూ ఒకేచోట కూర్చొని భోజనం చేస్తూ, కబుర్లు చెప్పుకుంటూ తమ కష్టాన్ని మరిచిపోతున్నారు.

– రామన్నపేట



వెల్లంకిలో మధ్యాహ్నం పొలం వద్ద భోజనం చేస్తున్న మహిళా కూలీలు



కక్కిరేణిలో నాట్లు వేస్తున్న మహిళా కూలీలు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

భువనగిరి: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన భువనగిరి మండలం కూనూరు గ్రామ సమీపంలో ఆదివారం జరిగింది. భువనగిరి మండలం చందుపట్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గ్రామం నుంచి కారులో భువనగిరికి వెళ్తుండగా ఆదివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలను కూనూరు గ్రామ సమీపంలో ఢీకొట్టాడు. దీంతో ఒక బైక్‌పై వెళ్తున్న ఇద్దరికి తీవ్రగాయాలు కాగా మరో బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు గాయపడిన ముగ్గురిని చికిత్స కోసం 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తివివరాలు తెలియాల్సి ఉంది.

యాదవ విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్



మేడబోయిన ప్రవీణ్

అర్వపల్లి: హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ యాదవ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మండల పరిధిలోని అడివెంల గ్రామానికి చెందిన మేడబోయిన ప్రవీణ్ అలియాస్ సిద్ధుయాదవ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్‌యాదవ్ ఆదేశాల మేరకు విద్యావంతుల వేదిక అధికార ప్రతినిధి నోముల శేషయాదవ్ ఉస్మానియా యూనివర్సిటీ విద్యావంతుల వేదిక కమిటీని స్థానికంగా జరిగిన సమావేశంలో ప్రకటించారు. ఈ సమావేశంలో యూనివర్సిటీ యాదవ విద్యార్థుల సంఘం నాయకులు సాయికుమార్, గణేష్, విజయ్, గంగరాజు, శరత్ పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంలో సక్సెస్



జీవామృతం తయారు చేస్తున్న గోవర్ధన్



దేశవాళీ బహురూపి వరి రకం సాగుచేస్తున్న గోవర్ధన్

- పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న ఆరెగూడెం యువకుడు

మోత్కూరు: ఉన్నత చదువులు చదివినా వ్యవసాయంపై ఉన్న మక్కువతో సేంద్రియ వ్యవసాయం చేస్తున్నాడు ఓ యువకుడు. మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన యువ రైతు బిల్లపాటి గోవర్ధన్‌రెడ్డి తనకున్న పదెకరాల వ్యవసాయ భూమిలో మూడు ఎకరాల విస్తీర్ణంలో సేంద్రియ వ్యవసాయం చేస్తున్నాడు. వరి, కంది, కూరగాయలు, బెండ, టమాట, మిర్చి, వంకాయ పంటలు పండిస్తున్నాడు. అర్థశాస్త్రంలో పీజీ పూర్తిచేసిన గోవర్ధన్ గత నాలుగేళ్లుగా గో ఆధారిత సేంద్రియ వ్యవసాయం చేస్తున్నాడు. అంతరించిపోతున్న దేశీయ వరి రకాలను కాపాడటం, పర్యావరణాన్ని, భూమిని పరిరక్షించుకోవడం, తగ్గిపోతున్న భూసారాన్ని కాపాడుకోవాలనే లక్ష్యంతో గోవర్ధన్ వ్యవసాయం చేస్తున్నాడు. రసాయనాలు లేని ఆహారాన్ని అందించడమే లక్ష్యంగా తనకున్న రెండు గోవులు, రెండు లేగదూడల ద్వారా ఘన జీవామృతం, జీవామృతం, పంచగవ్య జీవామృతంతో పాటు ప్రకృతి కషాయాలతో దేశవాళీ పంటలను పండిస్తున్నాడు. కూరగాయలు, ఆకు కూరగాయలతో పాటు వరిలో దేశవాళి రకాలైన నవారా, రత్న చోడి, మైసూర్ మల్లిక, మట్టా రైస్, కులకర్, కృష్ణప్రియ, బహురూపి వంటిని పండిస్తున్నాడు. సేంద్రియ ఎరువులతో పండించిన పంటలకు మార్కెట్‌లో ప్రస్తుతం మంచి డిమాండ్ ఉండటంతో ఆశించిన లాభాలు వస్తున్నాయని గోవర్ధన్ చెబుతున్నాడు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన ప్రతిష్ఠ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుడమి పుత్ర పురస్కారాన్ని గత నెల 22వ తేదీన యాదగిరిగుట్టలో నిర్వహించిన కార్యక్రమంలో గోవర్ధన్‌రెడ్డి అందుకున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తా



సేంద్రీయ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తా. అవగాహన సదస్సులు, శాస్త్రవేత్తలు, సేంద్రియ రైతుల సూచనలు, సలహాలతో సేంద్రియ పంటలపై అవగాహన పెంచుకుంటున్నాను.

– బిల్లపాటి గోవర్ధన్‌రెడ్డి, యువ రైతు